క్లుప్తంగా

గణితంలో డాక్టరేట్


నేలటూరు సారథి

వైవీయూ: కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో జేకేసీ మెంటార్‌గా పని చేస్తున్న నేలటూరు సారథికి గణితశాస్త్రంలో తిరుపతి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఎస్వీయూ గణిత శాస్త్రశాఖ ఆచార్యులు ఎ. సుధాకరయ్య, డా. ఎన్. ఉషారాణిల పర్యవేక్షణలో ‘వేరియస్ స్టడీస్ ఆన్ స్ప్లిట్ అండ్ నాన్ స్ప్లిట్ డామినేటింగ్ సెట్స్ ఆఫ్ ఆన్ ఇంటర్వెల్ గ్రాఫ్ యూజింగ్ ఆన్ అల్గారిదం విత్ యాడ్ అండ్ ఈవెన్ వరినెస్’ అన్న అంశంపై ఈయన చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్, అధ్యాపకులు ఆయన్ను అభినందించారు.

నారాయణ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి అక్రమ అడ్మిషన్ చేస్తున్న నారాయణ విద్యా సంస్థల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు పేర్కొన్నారు. శనివారం ఈ మేరకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో జీఆర్ఎస్‌వైఎఫ్ నాయకులు పృథ్వీ సురేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం


ప్రమాదకర స్థితిలో మ్యాన్‌హోల్

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగర పరిధిలోని ఆర్కే నగర్‌లో మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా ఉంది. నిత్యం ప్రజలు రాకపోకలు సాగించే ఈ ప్రాంతంలో మ్యాన్ హోల్ సగం వరకు తెరిచి ఉండడంతో చిన్నారులు, వృద్ధులు, వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు ఈ మ్యాన్‌హోల్‌ను సరిచేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ఏడు గేదెల మృతి

కొండాపురం: మండలంలోని దత్తాపురం గ్రామానికి చెందిన పాడి రైతు బెస్త అంకన్నకు చెందిన ఏడు గేదెలు శనివారం మృతి చెందినట్లు బాధితుడు తెలిపారు. వాటి విలువ రూ.6 లక్షలు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం నుంచి సాయం అందేలా న్యాయం చేయాలని ఆయన కోరారు

ఐటీఐ ప్రవేశం కోసం దరఖాస్తుల ఆహ్వానం

జమ్మలమడుగు : ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశం కోసం పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు జూన్ 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ నవరూప్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐటీఐలో అడ్మిషన్ కోసం దరఖాస్తులు చేసుకునే విద్యార్థులు 8వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు, పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన సాధించకపోయిన వారు కూడా అర్హులై అన్నారు. దరఖాస్తులు చేసుకునే విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో పాటు కులధృవీకరణ పత్రం, ఆదాయపత్రము, ఆధార్‌కార్డు ఫొటోలతో ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని సూచించారు.

ప్లాస్టిక్ వాడితే చర్యలు


అధికారులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వ్యాపార సంస్థల యజమానులు ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో ఆయన మాట్లాడుతూ పట్టణంలో ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని పూర్తిగా నిషేధించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. వ్యాపారస్తులు ప్లాస్టిక్ బదులు గుడ్డ, జనపనార సంచులను వాడాలన్నారు. బయోగ్రేడబుల్ వంటివి కూడా వాడవచ్చన్నారు. ఎవరైనా వ్యాపారస్తులు ప్లాస్టిక్ వాడినట్లు తెలిస్తే రూ.5 వేల నుంచి రూ.40 వేల వరకు జరిమానా విధిస్తామన్నారు. వినియోగదారులు వాడినా రూ.500లు జరిమానా ఉంటుందన్నారు. పట్టణంలో ఉన్న అన్ని టిఫిన్ సెంటర్లు, హోటళ్లలో ఇడ్లీ తయారు చేయుటకు గుడ్డలను మాత్రమే వాడాలన్నారు. పట్టణ ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలన్నారు. ప్లాస్టిక్ నిషేధంపై తనిఖీలు యదావిధిగా కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, శానిటేషన్ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


రేణుకా యల్లమాంబ అమ్మవారి కల్యాణం తిలకిస్తున్న భక్తులు

కల్యాణం.. కమనీయం..


రేణుకా యల్లమాంబ కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

సిద్దవటం : మండలంలోని మాచుపల్లెలో శ్రీ రేణుకా యల్లమాంబ కల్యాణం శనివారం సాయంత్రం వైభవోపేతంగా జరిగింది. జగజ్జననీ శ్రీ రేణుకా యల్లమాంబ సమేత జమదగ్ని మహర్షి ఉత్సవ మూర్తులకు గణపతిపూజ, పుణ్యహావాచనం, యజ్ఞోప విధారణ, కంకణాధారణ, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, ముత్యాల తలంబ్రాలు వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేదపండితులు రంగసముంద్ర మల్లికార్జునశర్మ, సుబ్రమణ్యం శర్మ, ప్రదీప్‌శర్మలు వేదమంత్రాల మధ్య మంగళ వాయిద్యాలతో అమ్మవారి కల్యాణం గ్రామ పెద్దల సమక్షంలో నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారి మూల విరాట్‌ను దర్శించుకొని కాయాకర్పూరాలు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అమ్మవారి కల్యాణం తిలకించారు.

తల్లిదండ్రుల్లో అప్రమత్తత అవసరం

– జడ్జి ఎస్.ప్రవీణ్‌కుమార్


మాట్లాడుతున్న జడ్జి ప్రవీణ్‌కుమార్

కడప అర్బన్: పిల్లలు అపహరణకు గురికాకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇన్‌ఛార్జ్ సెక్రటరీ, జడ్జి ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. ‘అంతర్జాతీయ తప్పిపోయిన పిల్లల దినం’ సందర్భంగా కడప ప్రభుత్వ బాలుర గృహంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ 1979 మే, 25న న్యూయార్క్ పాఠశాలకు వెళుతున్న ఎటాన్ పాట్జ్ అదృశ్యమవగా, ఛేదించలేని మిస్టరీగా ఆ కేసు మిగిలిపోయింది. 1983లో యునైటెడ్ స్టేట్స్ అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్ మే 25న ‘ఎటాన్ పాట్జ్’ జ్ఞాపకార్థకంగా జాతీయ తప్పిపోయిన పిల్లల దినోత్సవంగా ప్రకటించాడన్నారు. అంతర్జాతీయ స్థాయిలో పిల్లల సంరక్షణకు ఐసీఎంఈసీ సంస్థను యుఎస్ వారు ప్రారంభించారన్నారు. చైల్డ్ హెల్ప్‌లైన్ టోల్ ఫ్రీ నెం. 1098, జాతీయ న్యాయసేవాధికార సంస్థ వారికి బాలల సంరక్షణ కోసం స్నేహ పూర్వక న్యాయ సేవల పథకం 2015ను వివరించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ జి.వీరయ్య, డీపీఓ జి.చెన్నారెడ్డి, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శాంత, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మనోహర్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జె.లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మెగా ఈవెంట్

కడప రూరల్ : కడప ప్రజలకు ఈ వేసవిలో ఆనందాన్ని అందించేందుకు ఈ నెల 26వ తేదీన ఆదివారం మెగా ఎంటర్‌టైన్‌మెంట్ ఈవెంట్ నిర్వహిస్తున్నామని డ్రీమ్ మీడియా ప్రతినిధి సుజాత, స్పార్క్ ఈవెంట్ ఆర్గనైజర్ అనీషలు తెలిపారు. వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కడప కన్వెన్షన్ సెంటర్‌లో సాయంత్రం 5 నుంచి 9 గంటల వరకు వినోద కార్యక్రమాలుంటాయన్నారు. ముఖ్యంగా జబర్దస్త్ షోకు చెందిన వెంకీమంకీ, లేడీ గెటప్‌ల మోహన్, హరికృష్ణ, తాగుబోతు రాజమౌళి, అప్పారావు తదితరులు అందరినీ అలరిస్తారన్నారు. అలాగే పులివెందుల మహేష్ తన మిత్ర బృందంతో కలిసి ప్రదర్శనలు ఇస్తారన్నారు. ఈవెంట్‌కు టికెట్ రూ.299గా నిర్ణయించామన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

కమలాపురం : మండల పరిధిలోని రామాపురంలో వెలసిన మోక్ష నారాయణస్వామి ఆలయంలో ఈనెల 21వ తేదీ నుంచి జరుగుతున్న బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగిశాయి. వేద పండితులు ఘనాపాటి వంశీకృష్ణ ఆచారత్వమున ఐదు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. చివరి రోజు శనివారం ఉదయం మండప అర్చనలు, సర్వ సూక్త పారాయణం, సమస్త పరివార దేవతామూర్తుల హోమాలు, పూర్ణాహుతి, పంచామృత స్నానం, మహా కుంబాభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన అశేష భక్త జనులు స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన సేవకుడు సాయినాథ శర్మ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

వైభవంగా పుష్పయాగం

పెండ్లిమర్రి : మండలంలోని వెయ్యినూతల కోన క్షేత్రంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ముగింపు సందర్భంగా శనివారం ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పి.నరసింహహరిప్రసాద్, వేదపండితుల ఆధ్వర్యంలో వైభవంగా పుష్పయాగం నిర్వహించారు. ముందుగా స్వామివారికి గణపతి పూజ, ఆకుపూజ నిర్వహించారు. అనంతరం 12 రకాల పుష్పాలతో వేదపండితుల సమక్ష్యంలో 12 సార్లు లక్ష్మీనరసింహస్వామి, లక్ష్మీదేవి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి పుష్పయాగం చేశారు. పుష్పయాగానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



పది సప్లిమెంటరీకి 381 మంది హాజరు


గాంధీనగర్ హైస్కూల్లో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా శనివారం నిర్వహించిన హిందీ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లాలోని 16 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన హిందీ పరీక్షకు 445 మంది విద్యార్థులకుగాను 381 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షల పర్యవేక్షణ కోసం ఏర్పాటు చేసిన రెండు ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు జిల్లాలోని 8 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశాయి. అలాగే జిల్లా విద్యాశాఖ అధికారి మర్రెడ్డి అనురాధ కడపలోని మున్సిపల్ కార్పొరేషన్ ఉర్దూ బాలుర హైస్కూల్‌ను పరిశీలించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు.

ఇంటర్ ఇంగ్లిష్ పరీక్ష ప్రశాంతం


పులివెందుల ప్రభుత్వ కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్ఐఓ వెంకటసుబ్బయ్య

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా రెండవ రోజు శనివారం నిర్వహించిన ఇంటర్ ఇంగ్లీష్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఇందులో భాగంగా ఉదయం సెషన్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు నిర్వహించిన ఇంగ్లీష్ పరీక్షకు 37 పరీక్షా కేంద్రాలకుగాను జనరల్‌కు సంబంధించి 6036 మంది విద్యార్థులకుగాను 5784 మంది హాజరుకాగా 252 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఒకేషనల్‌కు సంబంధించి 479 మంది విద్యార్థులకుగాను 439 మంది హాజరుకాగా 40 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం సెషన్‌లో భాగంగా ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు నిర్వహించిన ఇంగ్లీష్ పరీక్షకు 20 పరీక్షా కేంద్రాలలలో జనరల్‌కు సంబంధించి 322 మంది విద్యార్థులకుగాను 288 మంది హాజరుకాగా 34 మంది గైర్హాజరయారు. అలాగే ఒకేషన్‌కు సంబంధించి 91 మంది విద్యార్థులకుగాను 81 మంది హాజరుకాగా 10 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో ఎక్కడ ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదు. ఇందులో భాగంగా ఇంటర్మీడియట్ ఆర్ఐవో బండి వెకటసుబ్బయ్య పులివెందలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాని తనిఖీ చేసి పరీక్షా కేంద్రంలోని ఇన్విజిలేటర్లకు పరీక్ష నిర్వహణపై పలు సూచనలు,సలహాలను చేశారు. అలాగే స్క్వాడ్ బృందం జిల్లాలోని పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

ఒంటె వాహనంపై చెన్నకేశవుడు


వెల్లాలలో పల్లకిలో ఉత్సవ మూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

రాజుపాళెం : మండలంలోని వెల్లాల పుణ్యక్షేత్రంలో శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి సంజీవరాయ స్వామిని ఒంటె వాహనంపై ఊరేగించారు. ముందుగా స్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి స్వామి వారిని ఆశీనులు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని భజన పాటలు పాడుకుంటూ స్వామి వారిని పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ చైర్మన్ జగదీశ్వర రెడ్డి, మాజీ చైర్మన్ విజయలక్ష్మి, సర్పంచ్ కానాల రాధ, వైఎస్సార్‌సీపీ నాయకుడు బలరామిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పవళింపు సేవ


పవళింపు సేవలో అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారు

ప్రొద్దుటూరు కల్చరల్ : అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి పవళింపు సేవ ను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేంగా నూతన పట్టువస్త్రాలు, పూలతో, ఆభరణాలతో అలంకరించి పవళింపు సేవను వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు.

స్కూల్ బస్సులు నిబంధనలు పాటించాలి

బద్వేలు అర్బన్ : బద్వేలు ఎంవీఐ కార్యాలయ పరిధిలోని 9 మండలాలలో వివిధ ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులను చేరవేసేందుకు ఉపయోగించే బస్సు, మినీవ్యాన్‌లు నిబంధనలు తప్పక పాటించాలని బద్వేలు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.శేఖర్‌రావు పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంవీఐ కార్యాలయంలో ఎఫ్‌సీ కోసం వచ్చిన స్కూల్ బస్సులను తనిఖీచేసి సంబంధిత డ్రైవర్లకు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి ఆయా పాఠశాలల బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ (ఎఫ్.సి) జారీ చేస్తున్నామని, పాఠశాలలు తెరిచే లోపు ప్రతి ఒక్కరూ తమ బస్సులకు ఎఫ్.సి. చేయించుకోవాలని, ఎఫ్‌సి లేకుండా రోడ్డెక్కితే చర్యలు తప్పవన్నారు. అలాగే పాఠశాలలకు ఉపయోగించే వాహనాలకు హెవీలైసెన్స్ పొంది, 5 సంవత్సరాల అనుభవం ఉన్న సీనియర్ డ్రైవర్లనే నియమించాలని సూచించారు. వాహనం సీటింగ్ కెపాసిటీ మేరకే విద్యార్థులను కూర్చోబెట్టాలని కోరారు.

ఖచ్చితంగా ప్రతి వాహనంలో ప్రథమ చికిత్సలకు సంబంధించిన సామాగ్రి, అగ్నిప్రమాద నిరోధక యంత్రాన్ని ఉంచాలని, బస్సు మెట్ల వద్ద లైటింగ్ ఏర్పాటు చేయాలని, ప్రతి బస్సుకు ఒక సహాయకుడిని నియమించాలని సూచించారు. పాఠశాలల బస్సులు నిబంధనలను పాటించకపోయినా, తనిఖీల సమయంలో ఏదైనా లోపాలు ఉన్నట్లు తెలిస్తే కఠిన చర్యలతో పాటు వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

రేపటి నుంచి సుంకులమ్మ బ్రహ్మోత్సవాలు

కమలాపురం : పట్టణంలోని పడమట వీధి సమీపం చెరువుగట్టుపై వెలసిన శ్రీ వజ్రాల(వరాల) సుంకులమ్మతల్లి 9వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈ నెల 27న ఉదయం మహా గణపతి పూజ, స్వస్తి పుణ్యావాచనము, పంచగవ్య ఆరాధన, ప్రధాన కలశ స్థాపన, సుంకులమ్మ దేవత పంచామృత అభిషేకములు నిర్వహించనున్నారు. 28వ తేదీన అమ్మ వారి మూల విగ్రహాలకు విశేష పంచామృత అభిషేకము, మహాకాళీ, మహాలక్ష్మీ, మహా సర్వసతి, నవగ్రహ, విశేష పూజలు నిర్వహిస్తారు. 29న ప్రాతః కాల పూజలు, మూలమూర్తికి ఉత్సవ విగ్రహములకు విశేష అభిషేకాల నిర్వహించనున్నారు. 30న అమ్మవారికి విశేష అభిషేకములు, అలకంరణ తదుపరి కుష్మాండబలి, పూర్ణాహుతి, మహా గణపతి హారతి తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు, భక్తులు విశేష సంఖ్యలో హాజరై కార్యక్రమాలను జయప్రదం చేయాలని నిర్వాహకులు తెలియజేశారు.

29న బండ లాగుడు పోటీలు :

శ్రీ వరాల సుంకులమ్మ తిరునాల మహోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 29వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు కమలాపురం ప్రాంతపు ఇసుక తోలే ఎద్దులకు బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపా రు. గెలుపొందిన విజేతలకు వరుసగా రూ.10వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.4వేలు, రూ.2వేలు, రూ.1వెయ్యి నగదు బహుమతులు ఇవ్వనున్నారు.

30న పాల పళ్ల ఎద్దులకు బండలాగుడు పోటీలు:

వరాల సుంకలమ్మ వార్షికోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 30న పాలపళ్ల విభాగం ఎద్దుల కు బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గెలుపొందిన విజేతలకు వరుసగా రూ.60 వేలు, రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.7 వేలు, రూ.5 వేలు నగదు బహుమతులు అందజేయనున్నారు.

కౌంటింగ్ రోజు స్థానికేతరులు

సొంత ఊళ్లకు వెళ్లాలి

- 144 సెక్షన్ నేపథ్యంలో కడప నగరంలో కఠిన ఆంక్షలు
- శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు సహకరించాలి
- కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్


కడపలో డీఎస్పీ కార్యాలయంలో హోటళ్లు, ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులతో సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ఎం.డి షరీఫ్

కడప అర్బన్: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జూన్ 4న జరుగనున్న నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీస్‌శాఖకు సహకరించాలనీ కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ పేర్కొన్నారు. శనివారం కడపలోని డీఎస్పీ కార్యాలయంలో లాడ్జిలు, ఫంక్షన్ హాల్‌ల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఎం.డి షరీఫ్ మాట్లాడుతూ కౌంటింగ్‌కు ముందు రోజైన జూన్ 3న లాడ్జీలను, ఫంక్షన్ హాళ్లను మూసివేయాలని, బస చేసిన ఇతర ప్రాంతాలకు చెందిన వారు సొంత ఊర్లకు వెళ్లిపోవాలని డీఎస్పీ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి స్థానికేతరులను తమ లాడ్జీలలో లేదా ఫంక్షన్ హాళ్లలో ఆశ్రయం కల్పించినట్లు తెలిస్తే ఆయా యాజమాన్యాలపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూన్ 4న కడప నగరంలోని రెస్టారెంట్లు, హోటళ్లు అన్ని మూసివేయాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. ఆర్టీసీ బస్సులకు కూడా నగరంలోకి ప్రవేశం లేదన్నారు. మెడికల్, ఎమర్జెన్సీ మినహా ఇతర ఎలాంటి దుకాణాలు తెరవకూడదని డీఎస్పీ తెలిపారు. కడప నగరంలో 144 సెక్షన్‌తో పాటు సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందన్నారు. కౌంటింగ్ నేపథ్యంలో ప్రజలందరూ శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలన్నారు.